రాత్రిపూట వైద్యులకు రక్షణ కల్పించాలి



గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సెక్యూరిటీ గార్డులను నియమించాలి. ముఖ్యంగా రాత్రి పూట పని చేసే వైద్యులకు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. వారికి మనోధైర్యం కల్పించాలి. పీహెచ్‌సీలలో విశ్రాంతి గదులు లేక డాక్టర్లు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి. డాక్టర్లకు భద్రత కల్పించాలి. ఎవరైనా దాడులు చేస్తే కఠినంగా శిక్షించేలా చట్టాల్లో మార్పులు తేవాలి. దీనిపై పాలకులు, అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

– దుర్గా, జూనియర్ డాక్టర్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు



మహిళా వైద్యులకు భద్రత ముఖ్యం



కోల్‌కతా ఘటనతో డాక్టర్లు, వైద్య సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఆసుపత్రుల్లో సెక్యూరిటీ కల్పించాలి. ప్రభుత్వం డాక్టర్లు, ఆసుపత్రులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎవరైనా దాడులు చేసినా కఠిన శిక్షలు ఉండేలా చట్టాల్లో మార్పులు చేయాలి. సుప్రీంకోర్టు సూచన మేరకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. తద్వారా వైద్యులు, సిబ్బందికి మనోధైర్యం కల్పించాలి.. ఆస్పత్రి సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– మనోజ్ఞ, జూనియర్ డాక్టర్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

అంగన్‌వాడీల్లో ఆకలి కేకలు

- సక్రమంగా అందని సరుకులు
- కందిపప్పు సరఫరాకు కత్తెర వేసిన ప్రభుత్వం
- అప్పు, తెచ్చుకుంటున్న నిర్వాహకులు
- కేంద్రాల నిర్వహణను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం



అంగన్‌వాడీ కేంద్రం

కాణిపాకం: మాతా శిశు మరణాల నివారణలో కీలకంగా పనిచేసే అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో అందించే పౌష్టికాహారం నిరుపేద గర్భిణులు, తల్లులు, చిన్నారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అందుకని ఆయా కేంద్రాలను బలోపేతం చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. కానీ ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణను పూర్తిగా గాలికొదిలేసింది. ప్రస్తుతం కేంద్రాలకు పౌష్టికాహారం సరుకులు సక్రమంగా సరఫరా కావడం లేదు. చిత్తూరు రూరల్ ప్రాజెక్టు పరిధిలోని కేంద్రాలకు ఆగస్టు నెలకు సంబంధించిన కందిపప్పు ఇవ్వలేదు. దీంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందడం లేదు. ప్రీ స్కూల్ నిర్వహిస్తున్నందున కేంద్రాలకు చిన్నారుల అర్ధాకలి చూడలేక, అంగన్‌వాడీ కార్యకర్తలు కందిపప్పు వేరే చోట నుంచి అప్పు తెచ్చి పిల్లలకు పప్పన్నం పెడుతున్నారు. ఈ పరిణామాలు కేంద్రాల కార్యకర్తలపై మరింత ఆర్థిక భారాన్ని పెంచుతున్నాయి.

కందిపప్పులో కోత

అంగన్‌వాడీ కేంద్రాలకు ఆగస్టు నెలకు సంబంధించిన సరుకులన్నీ జూలై ఆఖరిలోనే సరఫరా చేయాల్సి ఉంది. కానీ కందిపప్పు ప్యాకెట్లను అసలు ఇవ్వలేదు. ఇక్కడ ఏదో రకంగా సర్దుబాటు చేస్తున్నా, బాలింతలు, గర్భిణులకు ఇంటికే ఇచ్చే సరుకుల్లో కందికి కోత పడింది. ఈ విషయాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు ఐసీడీఎస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, సరుకుల సరఫరా వ్యవహారం రాష్ట్ర స్థాయిలో జరుగుతుండడంతో వారు కూడా ఏమీ చేయలేక మిన్నకుండిపోయారు. ఈ పరిస్థితుల్లో కందిపప్పు లేకుండా, మిగతా సరుకులు అందిస్తున్నారు.

గాడి తప్పుతున్న నిర్వహణ

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పంపిణీలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ప్రతి నెలా ఒక్కొక్కరికి మూడు కిలోల బియ్యం, ఒక కిలో కంది పప్పు, అరకిలో నూనె, 25 కోడి గుడ్లు, ఐదు లీటర్ల పాలు, రెండు కిలోల రాగి పిండి, అరకిలో పప్పు చెక్క, అరకిలో బెల్లం, ఒక కిలో అటుకులు పంపిణీ చేస్తారు. ప్రతి కేంద్రంలో నమోదైన గర్భిణులు, బాలింతలు, పిల్లల సంఖ్య మేరకు ప్రతి నెలా ఆఖరి వారంలో తదుపరి నెలకు సంబంధించిన సరుకులు సరఫరా చేస్తారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సరుకులు సకాలంలో సరఫరా కావడం లేదు.

కేంద్రాలు అస్తవ్యస్తం

సమస్యలు పరిష్కరించని ప్రభుత్వం మరోవైపు తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు ఎన్నికలకు ముందు రిలే దీక్షలు చేపట్టారు. వేతనాలు పెంచాలని, కేంద్రాలకు సంబంధించిన అద్దె బకాయిలు సకాలంలో చెల్లించాలని, ఇతర నిర్వహణ ఖర్చులు ఇవ్వాలని డిమాండ్లతో ధర్నా చేశారు. కానీ కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారంపై ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదు. మాతా శిశు సంరక్షణలో కీలకంగా పనిచేసే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై ఉన్నత స్థాయి సమీక్ష కూడా లేకపోవడంతో ప్రస్తుతం కేంద్రాలు అస్తవ్యస్తంగా నడుస్తున్నాయి.

చిత్తూరు ప్రాజెక్టు పరిధిలోని కేంద్ర వివరాలు

పరిధిలోకి వచ్చే ప్రాంతాలు (చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్ మండలం, గుడిపాల)		
మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు	-	227
గర్భిణీల సంఖ్య	-	1123
బాలింతల సంఖ్య	-	9344
0-6పిల్లల సంఖ్య	-	93944

ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం

అంగన్‌వాడీ కేంద్రాలకు ఆగస్టు నెలకు సంబంధించి కందిపప్పు సరఫరా కాలేదు. అయినప్పటికీ కేంద్రాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం. గతంలో మిగిలి ఉన్న స్టాకు వినియోగించుకోవాలని కేంద్రాల కార్యకర్తలకు చెప్పాం. ఒక కేంద్రంలో ఎక్కువ నిల్వ ఉంటే, దాన్ని మరో కేంద్రానికి సర్దుబాటు చేస్తూ పిల్లలకు పౌష్టికాహారం అందించేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. పిల్లల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

–శ్యాంసుగుణకుమారి, సీడీపీఓ, చిత్తూరు

విద్యాసేవలకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న భాస్కర్

చిత్తూరు కలెక్టరేట్: విద్యాసేవలకుగాను హార్వర్డ్ పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ మేరకు శనివారం బెంగళూరులో భారత్ వర్చువల్ యూనివర్సిటీ నిర్వాహకుల చేతుల మీదుగా ఆయన డాక్టరేట్‌ను అందుకున్నారు. గత 30 ఏళ్లకు పైగా చిత్తూరు నగరంలో అందిస్తున్న విద్యాసేవలకు గాను ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. పలు పాఠశాలల నిర్వాహకులు, కుటుంబ సభ్యులు ఆయనకు అభినందనలు తెలిపారు.

నూతన వధువుకు మంగళసూత్రం వితరణ



భవ్యకు మంగళసూత్రాన్ని అందజేస్తున్న రాజేశ్వరమ్మ, సీఓఓ రాంబాబు

తవణంపల్లె: మండలంలోని అరగొండ టోటల్ హెల్త్‌లో విధులు నిర్వహిస్తున్న భవ్యకు పెళ్లి సమయంలో అపోలో హాస్పిటల్ అధినేత డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి రూ.40 వేలు విలువ చేసే మంగళసూత్రాన్ని అందించినట్లు స్థానిక మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకురాలు రాజేశ్వరమ్మ తెలిపారు. కార్యక్రమంలో టోటల్ హెల్త్ సీఓఓ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

గాలికుంటు నివారణకు టీకాలు



పశువులకు వ్యాక్సిన్‌లు వేస్తున్న సిబ్బంది

గుడిపాల: గాలికుంటు వ్యాధి వ్యాప్తి చెందకుండా టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారి సుధారాణి అన్నారు. పసుమంద గ్రామంలో శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను వేశారు. ఆమె మాట్లాడుతూ నాలుగు నెలల దూడ నుంచి అన్ని పశువులకు టీకాలు వేయాలన్నారు. టీకాలు వేయడం వలన పశువులకు హాని కలుగుతుందనే అపోహను వీడాలని చెప్పారు. కొంతమంది పాల దిగుబడి తగ్గుతుందని చాలా వరకు వ్యాక్సిన్ వేసుకోవడం లేదని అటువంటి నమ్మకాలను విడనాడాలన్నారు. ట్రైనీ డాక్టర్ పురుషోత్తం, పశువైద్య సిబ్బంది అబ్దుల్లా పాల్గొన్నారు.

వరసిద్ధునికి రూ.6 లక్షల విరాళం

కాణిపాకం: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని నిత్యాన్నదానానికి శనివారం ఓ దాత నగదు విరాళం చేశారు. బెంగళూరుకు చెందిన దాత పి.బాబు రూ.5 లక్షల నగదును ఆలయ ఈఓ కె వాణికి అందజేశారు. మరో దాత దాత మండుటి సునీల్ కుమార్ రూ.లక్షల చెక్కును అందజేశారు. దాతల కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి దర్శనార్థం కల్పించారు. స్వామివారికి ప్రత్యేక దర్శనం కల్పించి, ఆశీర్వాద మండపంలో వేద పండితులచే వేద ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు కోదండపాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యం



వైద్యసేవలందిస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో గర్భిణులకు ఇంటి వద్దకే మెరుగైన వైద్యం వస్తోందని బొమ్మసముద్రం వైద్యాధికారి రష్మిత అన్నారు. మండలంలోని చామంతిపురంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. బీపీ, చక్కెరవ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇందులో 55 మందికి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. వైద్య సిబ్బంది శ్రీలక్ష్మి, యమున, రాధ పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌కు ఉద్యోగోన్నతి

చిత్తూరు కలెక్టరేట్: విద్యాశాఖలో విధులు నిర్వర్తిస్తున్న సీనియర్ అసిస్టెంట్ స్వర్ణలతకు ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు వైఎస్సార్ కడప జిల్లా ఆర్జేడీ శామ్యూల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు డీఈఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న స్వర్ణలతకు సూపరింటెండెంట్ గా ఉద్యోగోన్నతి కల్పించారు. ఆమెను అన్నమయ్య జిల్లా డీఈఓ కార్యాలయానికి బదిలీ చేశారు.

చిత్తూరు డీఎస్పీగా సాయినాథ్

చిత్తూరు అర్బన్: చిత్తూరు డీఎస్పీగా టి.సాయినాథ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రాజగోపాల్ రెడ్డికి పోస్టింగ్ ఇవ్వకుండా పోలీస్ ప్రధాన కార్యాలయానికి అటాచ్ చేస్తూ, ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. నెల్లూరు మహిళా పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న సాయినాథ్‌ని చిత్తూరుకు బదిలీ చేశారు. డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్పీ మణికంఠను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయాలి



సరకల్లులో ఈ-క్రాప్ పరిశీలిస్తున్న ఏఓ ప్రవీణ్

తవణంపల్లె: ఈ పంట నమోదును వేగవంతం చేయాలని ఏఓ ప్రవీణ్ సూచించారు. మండలంలో రైతులు సాగు చేసిన పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఈ-క్రాప్ నమోదు చేయాలని తెలిపారు. మండలంలోని సరకల్లు, చెంగనపల్లె, దిగువమత్యం గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదును పర్యవేక్షించారు. వ్యవసాయ పంటలు 3,320 ఎకరాలు ఉద్యాన పంటలు 12,300 ఎకరాల్లో ఈ-క్రాప్ చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 8,750 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి ఈ-క్రాప్ నమోదు చేసి నివేదిక ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో లేని ఏఈ



మూతబడి ఉన్న ఏఈ కార్యాలయం,



దుమ్ము, ధూళితో నిండిపోయిన కార్యాలయం

యాదమరి (పూతలపట్టు): రైతులు తమ సమస్య పరిష్కార నిమిత్తం ఓ ప్రభుత్వ కార్యాలయం చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆ ఉన్నతాధికారి మాత్రం కార్యాలయానికి హాజరుకావడం లేదు. బాధితుల కథనం మేరకు యాదమరి మండలం జోడిచింతల సమీపంలోని విద్యుత్ ఉపకేంద్రం ఆవరణలో అసిస్టెంట్ ఇంజనీరింగ్ కార్యాలయం ఉంది. మండలంలోని రైతులు తమ విద్యుత్ సమస్యలతో ఏఈ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన, మండల ప్రజలకు కార్యాలయంలో ఏఈ అందుబాటులో ఉండడం లేదు. రైతులు తమ సమస్యలను అర్జీల రూపంలో చేతపట్టుకొని ఉదయాన్నే వచ్చి కార్యాలయం ఎదుట కుర్చుంటే మధ్యాహ్నం, సాయంత్రమైనా కార్యాలయానికి ఏఈ మాత్రం హాజరుకావడం లేదు. దీంతో రైతులు వేచి చూసి ఇంటికి వెనుతిరిగి వెళ్లిపోతున్నారు. సమస్యలను ఫీల్డ్‌కి వెళ్లి పరిశీలించడం లేదని, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించకుండా సర్వీసులను మంజూరు చేస్తున్నారని, ఆ ఏఈపై ఆరోపణలు గుప్పుమంటున్నాయి. లైన్‌మన్ల ద్వారా అనుకూలమైన వారికి పనులు చేసి పెడుతున్నారని చర్చ మొదలైంది. రైతులు ఫోన్ చేస్తే ఫీల్డ్ మీద ఉన్నానంటూ, వస్తాను..వస్తానంటూ కార్యాలయానికి రాకుండా వారిని రైతులను పడిగాపులు గాచేలా చేస్తున్నారు.

40 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: గ్రామీణ ప్రాంత ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి ప్రియాంక అన్నారు. మండలంలోని ద్వారకపురంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 40 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అనధికార లే ఔట్లలో ప్లాట్లు కొనవద్దు



మున్సిపల్ పార్కు సుందరీకరణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో అనధికార, అనుమతి లేని లే ఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేయడం చట్టవిరుద్ధమని నగరపాలక కమిషనర్ అరుణ అన్నారు. ఆమె శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. మిట్టూరులోని మునస్వామినాయుడు పార్కు అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నగర పరిధిలో అనధికార లేఔట్లు, స్థలాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా వేసిన లే ఔట్లు, స్థలాల్లో ప్లాట్లు కొనుగోలు చేస్తే రిజిస్ట్రేషన్‌లు చేయలేరని చెప్పారు. అనుమతులు లేని లేఔట్లల్లో మౌళిక సదుపాయాల కల్పన, రోడ్లు, డ్రైనేజీ, నీటి సరఫరా, విద్యుత్ సౌకర్యాలు కల్పించబడవన్నారు. ఈ విషయాన్ని నగర ప్రజలు గుర్తించాలని తెలిపారు. అనధికార లేఔట్లల్లో స్థలాలు విక్రయిస్తున్న యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిట్టూరులో ఉన్న మునస్వామి నాయుడు మున్సిపల్ పార్కులో సుందరీకరణ పనులను వేగవంతంగా పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. పార్కులో పచ్చదనం పెంచేలా ఎక్కువ సంఖ్యలో మొక్కలు నాటాలన్నారు. లైటింగ్ సామర్థ్యం పెంచి చిన్నపిల్లలు ఆడుకునేలా ఆటవస్తువులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈలు వెంకట ప్రసాద్, రమణ, ఏఈలు లోకేష్, రవీంద్ర, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుడిపాల: బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని నరహరిపేట హైస్కూల్లో శనివారం రీల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కార్యదర్శి రామారావు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలకార్మికుల చట్ట ప్రకారం బాలలు ఉండాల్సింది బడుల్లో మాత్రమేనని చెప్పారు. అంతే కానీ పనుల్లో, పొలంలో బాలలు కనిపించకూడదన్నారు. బాల్యవివాహాలను చేసుకోకూడదని వారికి దానిపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వారికి పలు సూచనలు చేశారు. అనంతరం గుడిపాల క్రాస్‌లో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఆయనతో పాటు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ జగదీష్, చైల్డ్‌రైట్స్ ప్రాజెక్ట్ మేనేజర్ హనీషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్య నియమాలు తప్పక పాటించాలి



దంత చికిత్స నిర్వహిస్తున్న డాక్టర్ హరిత

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు ఆరోగ్య నియమాలు తప్పక పాటించాలని డాక్టర్ హరిత అన్నారు. నగరంలోని కస్తూర్బా బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం శ్రీ సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా దంత చికిత్సలు చేశారు. డాక్టర్ హరిత మాట్లాడుతూ విద్యార్థులు దంతాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆరోగ్య సూత్రాలను ప్రతి విద్యార్థి తప్పని సరిగా పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షులు మధుసూదనం, సభ్యులు మనోహర్, శేషనారాయణ పాల్గొన్నారు.

రేపటి నుంచి జన్మాష్టమి వేడుకలు

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పట్టణానికి చెందిన ప్రబోధ సేవాసమితి –ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 26వ తేదీ సోమవారం నుంచి 30వ తేదీ వరకు స్థానిక రాజావీధిలో ఏర్పాటు చేసిన పూజా మందిరంలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, గీతాలాపన, భజన కార్య క్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. 30వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం శ్రీకృష్ణ భగవానుడి ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగించనున్నట్లు తెలిపారు. దైవ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

మంగళవిద్యావాణి 28వ సంచిక ఆవిష్కరణ



మంగళవిద్యావాణి సంచికను ఆవిష్కరిస్తున్న సర్పంచ్, ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మంగళవిద్యావాణి 28వ సంచికను హెచ్ఎం రాజ్యలక్ష్మి అధ్యక్షతన ఆవిష్కరించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానిక సర్పంచ్ మురళి సంచికను ఆవిష్కరించారు. నలగాంపల్లెకు చెందిన వ్యాపారవేత్త ధరణి సంచిక ముద్రణకు ఆర్థిక సాయం అదించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సంబంధించి ప్రత్యేక విద్యా మాసపత్రికను నడపడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. ఇలాంటి మాసపత్రికను రాష్ట్రంలో ఏ పాఠశాలలోనూ నడపడంలేదని అన్నారు. విద్యార్థుల్లో రచనాశక్తిని పెంపొందించేందుకు ఇలాంటి మాసపత్రికలు తోడ్పడతాయన్నారు. హెచ్ఎం మాట్లాడుతూ, ఇప్పటి వరకు 28 సంచికలను తీసుకురావడంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు చేసిన కృషి అభినందనీయమన్నారు. విశిష్ట అతిథులుగా హాజరైన విశ్రాంత ఉపాధ్యాయుడు రుష్యేంద్రపతి, పోలీస్ అధికారి సుధాకరపిళ్లై తదుపరి సంచికలకు ఆర్థిక సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంచిక సమన్వయకర్త అరుణ్‌శివప్రసాద్, రమాదేవి, సంజీవి, భారతి, పిళ్లారప్ప, మోహన్‌రెడ్డి, ప్రేమకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్మార్ట్ దెబ్బకు సినిమా కుదేలు



శిథిలావస్థలో ఉన్న లక్ష్మీ థియేటర్(ఫైల్)

పలమనేరు: పట్టణంలో ఎవరైనా ఎక్కడున్నావంటే తాను లక్ష్మీ టాకీస్ వద్ద అనో, రామలక్ష్మణా అనో చిరునామా చెప్పుకోవడానికి తప్పిస్తే అక్కడ ఇప్పుడు ఆ సినిమాహాళ్లు లేవు. గతంతో ఎంతో పేరుగాంచిన నాటి సినిమా హాళ్లు ఇప్పుడు జాడ లేకుండాపోయాయి. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో దూసుకొస్తున్న పలు రకాల సెట్ అప్ బాక్సులు, కేబుల్ నెట్‌వర్క్, స్మార్ట్ ఫోన్ల డిజిటల్ దెబ్బకు థియేటర్ల ఉనికి ప్రశ్నార్థకమైంది. కనీసం పెట్టిన డబ్బుకు సరిపడా ఆదాయం లభించకపోవడంతో పలు థియేటర్లు నష్టాలతో మూసివేతకు గురవుతున్నాయి. ఇప్పటికే ప్రేక్షకాదరణ కరువై థియేటర్లు అపార్ట్‌మెంట్లుగా, షాపింగ్ కాంప్లెక్స్‌లు, కల్యాణ మండపాలుగానూ రూపాంతరం చెందాయి. మరికొన్నింటిని ధ్వంసం చేసి ఇళ్ల స్థలాలకు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికే ఆరాకొరగా ఉన్న థియేటర్ల మనుగడ భవిష్యత్తులో మరింత ప్రశ్నార్థకం కానుంది.

1951లో మోహన్ టూరింగ్ టాకీస్..

పలమనేరు పట్టణంలోనే మొట్టమొదటి టాకీ సినిమాను రుచి చూపించిన ఘనత మోహన్‌రెడ్డికే దక్కుతుంది. 1970వ దశకంలో గండికోట లక్ష్మయ్య, రామయ్యశెట్టి ఇక్కడ రామలక్ష్మణ అనే థియేటర్‌ను నిర్మించారు. తర్వాత తీర్థంకు చెందిన లక్ష్మీనారాయణశెట్టి లక్ష్మీ పిక్చర్ ప్యాలెస్‌ను నిర్మించారు. తర్వాత రంగమహల్, వి.వి.మహల్, మంజునాథ, పద్మశ్రీ థియేటర్లు వెలిశాయి.

ఇప్పుడిది వీటి పరిస్థితి..

లక్ష్మీథియేటర్‌ను ధ్వంసం చేశారు. అక్కడ మొండి గోడలు మాత్రం కనిపిస్తున్నాయి. ఇక రామలక్ష్మణ టాకీస్‌ను పడగొట్టి ప్రకృతి అపార్ట్‌మెంట్‌ను కట్టారు. రంగమహల్‌ను ఇటీవల ఆధునీకరించారు. ముంజునాథ్, వీవీ మహల్, పద్మశ్రీ సినిమాహాళ్ల పరిస్థితి నష్టాలబాటలో ఉంది. ఇవి కూడా ఎన్నాళ్లుంటాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇక్కడి ఆపరేటర్లు, సిబ్బంది ఇతర పనులు చేసుకుంటున్నారు.

బండరాయి పడి యువకుడి మృతి





బాలెండర్ (ఫైల్), మృతిచెందిన బాలెండర్

గుడిపాల: మండలంలోని చెన్నై–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే పనులు చేస్తున్న ప్రొక్లెయిన్‌పై బండరాయి పడి యువకుడు మృతిచెందాడు. ఎస్ఐ రామ్మోహన్ కథనం మేరకు.. చెన్నై–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ పనులను మోంటోకార్లో కంపెనీ చేస్తోంది. ఇందులో భాగంగా చీలాపల్లె సమీపంలో రింగ్ రోడ్డు పనులు చేస్తున్నారు. ఇక్కడ అరుల్‌పురం కొండపైన దారి ఏర్పాటు చేస్తుండగా పెద్ద బండరాయి ప్రొక్లెయిన్‌పై పడింది. దీంతో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం రామ్‌పూర్ జిల్లా అహ్రాంగాడ్ గ్రామానికి చెందిన బాలెండర్(24) అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు పెంచండి

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్‌లను పెంచేందుకు మండల స్థాయిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల స్థాయిలో ఎన్రోల్‌మెంట్, ఓరియెంటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర అధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఓపెన్ స్కూల్ పది, ఇంటర్మీడియట్ అడ్మిషన్‌ల సంఖ్యను పెంచేందుకు ఏఐ కో–ఆర్డినేటర్లు చర్యలు చేపట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించి అడ్మిషన్లను చేయించాలని తెలిపారు.

జారిపడి వ్యక్తికి తీవ్రగాయాలు

గుడిపాల: ఇంటిలో ప్లంబింగ్ పనిచేస్తూ పైనుంచి కింద పడడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైనట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఆయన కథనం మేరకు, వసంతాపురంలో అరగొండకు చెందిన లోకనాథరెడ్డి(50) ప్లంబింగ్ పని చేస్తుండగా పై నుంచి కిందకు అదుపుతప్పి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108 సిబ్బంది శివ, బాబీలు అక్కడికి చేరుకొని అతనికి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పలువురికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన ఒక్కో వ్యక్తికి రూ.పది వేల చొప్పున జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి శనివారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 21 మందిపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.2.10 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.